పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి
- అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో జేవీకే కిట్లు పంపిణీ


కోవూరు : విద్యాకానుక కిట్లు అందుకున్న విద్యార్థులతో పమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగానికి పెద్దపీట వేస్తోందని, పేద విద్యార్థులకు కార్పొరేట్ తరహా విద్యను అందిస్తున్నట్లు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. కోవూరు మండల కేంద్రంలోని పీఆర్‌ఆర్ యూపీ స్కూల్‌లో విద్యార్థులకు సోమవారం జగనన్న కానుక కిట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని మొత్తం 350 ప్రభుత్వ పాఠశాలల్లో 26,350 మంది విద్యార్థులకు కిట్లను పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

మనుబోలు : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందని జెడ్పీటీసీ సభ్యురాలు చిట్టమూరు అనితమ్మ అన్నారు. మండలంలోని మనుబోలు, అక్కంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో జగనన్న విద్యా కానుక కిట్లను సోమవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచడమే కాకుండా విద్యార్థులకు అవసరమైన యూనిఫాం, బ్యాగులు, బూట్లు నాణ్యతతో అందజేస్తున్న ఘనత ఈ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు సర్పంచ్ నారపరెడ్డి జాంబవతమ్మ, కంచి పద్మమ్మ, మాజీ సర్పంచ్ నారపరెడ్డి కిరణ్ కుమార్‌రెడ్డి, చిట్టమూరు అజయ్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, అనమాల ప్రభాకర్‌రెడ్డి, చేరెడ్డి రామిరెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, అంబటి శ్రీనివాసులురెడ్డి, హెచ్‌ఎంలు డేవిడ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

- **పొదలకూరు :** మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను అందజేశారు. మండలంలోని మరుపూరు జెడ్పీహైస్కూల్లో వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి విద్యార్థులకు కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మురళీ, ఉపాధ్యాయులు, పీసీ చైర్మన్ పాల్గొన్నారు. పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు సర్పంచ్ చిట్టెమ్మ జేవీకే కిట్‌ను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పెర్సిస్, పీసీ చైర్మన్ సురేఖ, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

విద్యకు పెద్దపీట

కొడవలూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు పేర్కొన్నారు. మండలంలోని నార్తురాజుపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను ఆయన సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద విద్యార్థులంతా ఉన్నత చదువులు అభ్యసించి బంగారు భవిష్యత్ పొందాలన్నదే సీఎం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, ఎంఈఓ జి.వసంతకుమారి, ఎంపీపీ గాలి జ్యోతి, సర్పంచ్‌లు బి.సుప్రియ, నల్లావుల శ్రీనివాసులు, మారంరెడ్డి రంగారెడ్డి, హెచ్‌ఎం డి.ఓబులేసు, ఏపీఎం ఎస్.రుక్మిణి, వైఎస్సార్‌సీపీ నేతలు అడపాల మోహనకృష్ణ, కొండా శ్రీనివాసులురెడ్డి, ఇసనాక సునీల్‌రెడ్డి, మండపల్లి మల్లికార్జున, దేవనబోయిన శివకుమార్ పాల్గొన్నారు.

భవితకు బాటలు

బుచ్చిరెడ్డిపాళెం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేస్తున్నారని బుచ్చి నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని బెజవాడ బుజ్జమ్మ జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు విద్యాకానుక కిట్లను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో చిన్నారులు చదువులకు దూరం కాకుండా అవసరమైన విద్యాసామగ్రికి అందజేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాసులు, ఎంఈఓ దిలీప్, కౌన్సిలర్లు జయంతి, యానాదిరెడ్డి, మల్లారెడ్డి, సత్యనారాయణ, ఈఓపీఆర్డీ శ్యామ్, హెచ్‌ఎం సుజాత పాల్గొన్నారు.


మనుబోలు : విద్యార్థులకు జేవీకే కిట్లు అందజేస్తున్న సర్పంచ్


కొడవలూరు: జేవీకే కిట్లను అందజేస్తున్న చలపతిరావు


మనుబోలు : జేవీకే కిట్లను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు


పొదలకూరు : జేవీకే కిట్‌ను అందజేస్తున్న వైస్ ఎంపీపీ తదితరులు


పొదలకూరు : విద్యాకానుక కిట్లు అందుకున్న విద్యార్థులతో సర్పంచ్, ఉపాధ్యాయులు


బుచ్చిరెడ్డిపాళెం: విద్యాకానుక కిట్‌ను అందజేస్తున్న బుచ్చి చైర్‌పర్సన్ సుప్రజ

క్లుప్తంగా

విజేతలకు అభినందన



ఇందుకూరుపేట : ఎన్‌సీసీ ఫైరింగ్ విభాగంలో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మల్లికార్జున, వ్యాయామ ఉపాధ్యాయుడు కె.అరోరా సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఈనెల 1వ తేదీ నుంచి 10 వరకు కొడవలూరు మండలం, నార్తురాజుపాళెంలో ఉన్న శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన 10(ఏ) నావెల్ ఎన్‌సీసీలో పాఠశాల నుంచి 36 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు చెప్పారు. వీరిలో పదో తరగతికి చెందిన బి.పూజశ్రీ., తొమ్మిదో తరగతికి చెందిన బి.సాయి హర్షిత్ ఫైరింగ్ విభాగంలో బంగారు పతకాలు సాధించినట్లు హెచ్‌ఎం వివరించారు.

ఉద్యోగం పేరిట మోసం

నెల్లూరు(క్రైమ్): తనకు, తన అన్నకు వెలుగులో ఉద్యోగం ఇప్పిస్తానని రూ.10 లక్షల నగదు తీసుకుని మోసగించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు మండలానికి చెందిన నరసింహులు పోలీసు ఉన్నతాధికారులను కోరారు. సోమవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ తాను కారుడ్రైవర్‌గా పనిచేస్తున్నానన్నారు. తనకు, తన అన్నకు ఉద్యోగం ఇప్పిస్తానని తన తల్లికి తెలిసిన వారైన కొమరిక రమణయ్య, సావిత్రి నమ్మించారన్నారు. దీంతో తమ అమ్మ రూ.10 లక్షలు ఇచ్చిందన్నారు. నెలలు గడుస్తున్నా ఉద్యోగాలు ఇప్పించకపోవడంతో నిలదీయగా రేపు, మాపూ అంటూ కాలం వెలిబుచ్చారని చెప్పారు. ఈ క్రమంలోనే తమ తల్లి మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమను మోసగించిన రమణయ్య, సావిత్రిపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎస్పీ తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

నెల్లూరు రూరల్: గత నెల 9న అల్లీపురంలో జరిగిన ప్రమాదంలో స్పృహతప్పి పడిపోయిన పూడి కమలమ్మ(90) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు రూరల్ పోలీసులు సోమవారం తెలిపారు. వివరాలు.. అల్లీపురంలో చెన్నకేశవస్వామి ఉత్సవాల ఊరేగింపులో ట్రాక్టర్ వెనుకగా కూర్చుని ఉన్న కమలమ్మ ప్రమాదవశాత్తు జారి పడిపోయింది. ఆమెను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఆమె మృతి చెందింది. ఈ మేరకు మనుమడు గోపి రూరల్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. రూరల్ పోలీసులు ఆస్పత్రికి చేరుకుని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్యవైశ్య విద్యార్థులకు ఉచిత వసతి సౌకర్యం

నెల్లూరు(బృందావనం): పప్పులవీధిలోని శ్రీపాండురంగ అన్నదాన సమాజం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయాలను కల్పిస్తున్నట్లు ఆ సమాజం కార్యదర్శి చలువాది వెంకటేశ్వర్లు, హాస్టల్ కమిటీ చైర్మన్ వాయుగుండ్ల హజరత్తయ్య సోమవారం తెలిపారు. నగరంలోని విద్యా సంస్థల్లో 2023–2024 విద్యాసంవత్సరంలో ఆరోతరగతి నుంచి డిగ్రీ వరకు చదువుతున్న విద్యార్థులు అర్హులని చెప్పారు. శ్రీపాండురంగ అన్నదాన సమాజం కార్యాలయంలో ఈ నెల 14 నుంచి 21వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, సాయంత్రం 5నుంచి రాత్రి 8గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నామని తెలిపారు. 25న అర్హులైన విద్యార్థుల తుది జాబితాను ప్రకటిస్తామని చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన ఆర్యవైశ్య విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాతృశ్రీ భవన సముదాయం ప్రారంభం

నెల్లూరు(బృందావనం): పుత్తా ఎస్టేట్ సమీపంలోని శ్రీపుష్పగిరి విద్యానృసింహభారతి స్వామి జిల్లా బ్రాహ్మణ భవన సముదాయంలో నూతనంగా నిర్మించిన మాతృశ్రీ భవన సముదాయాన్ని సోమవారం ప్రారంభించారు. గుంటూరుకు చెందిన న్యాయమూర్తి బీ శివశంకరరావు, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్రాధ్యక్షుడు ఎస్ వెంకటరామరాజు ముఖ్యఅతిథులుగా హాజరై రిబ్బన్ కట్ చేసిన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ వాసుదేవరావు, ఐ కామేశ్వరప్రసాద్ మాట్లాడుతూ జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి ఆధ్వర్యంలో పుష్పగిరి విద్యాభారతి స్వామి అనుగ్రహ దాతృత్వంతో మాతృశ్రీ భవనాన్ని నిర్మించినట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య గౌరవాధ్యక్షుడు కేవీ బలరామకృష్ణమూర్తి, రాష్ట్ర సలహాదారుడు గుళ్లపల్లి శివశర్మశ్రౌతి,నెల్లూరు ఆర్డీఓ మలోల రాష్ట్ర, జిల్లా బ్రాహ్మణ సంఘాల నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మోగిన బడిగంట

- పాఠశాలలు పునఃప్రారంభం


బడి గంట మోగిస్తున్న పాఠశాల సిబ్బంది

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు సోమవారం పునఃప్రారంభమయ్యాయి. మండల పరిధిలోని ఏడు ఉన్నత పాఠశాలతో పాటు మరో 62 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో తరగతులు జరిగాయి. తొలిరోజు కావడంతో ఆయా పాఠశాలల్లో 30 శాతం మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. మండలంలోని 69 పాఠశాలల్లో 6,460 మంది విద్యార్థులు ఉండగా అందరికీ జగనన్న విద్యాకానుక కిట్లను అందజేశారు.

మధ్యాహ్న భోజనం ఏర్పాటు


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ శ్రీనివాసులు

మండుతున్న ఎండల కారణంగా ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు మాత్రమే పాఠశాలల్లో తరగతులు జరిగాయి. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించి ఇళ్లకు పంపారు.

నేడు స్వర్ణభారత్‌లో ఎన్టీఆర్ శత జయంతి

వెంకటాచలం: మండల కేంద్రంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలో మంగళవారం ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు జరుగనుంది. సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమంలో భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు.

ఉద్యోగులూ ప్రభుత్వంలో భాగమే

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

కోవూరు: సర్కార్ ఉద్యోగులు ప్రభుత్వంలో భాగమే అని, అందరం కలిసి పనిచేస్తేనే సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరుతాయని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సచివాలయం–3 పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రసన్న సోమవారం చేపట్టారు. ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను వివరించి బుక్‌లెట్‌ను అందజేశారు. అనంతరం కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించడం పట్ల ఉద్యోగ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేస్తూ పీఆర్‌ఆర్ కాలనీలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యేతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ నేతలు మాట్లాడుతూ దాదాపు 20 సంవత్సరాల నుంచి పలు శాఖల్లో పనిచేస్తూ అలిసిపోయిన తమకు సీఎం వైఎస్ జగన్ అండగా నిలిచారని, ఊపిరి ఉన్నంత వరకు ఆయన కోసమే పనిచేస్తామని తెలిపారు. అనంతరం సీఎం జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు.

చిన్నారి ఆకాంక్ష.. ఎమ్మెల్యే సాకారం

గడప గడపలో భాగంగా ఇంటింటికి వెళ్తున్న ఎమ్మెల్యే ప్రసన్న వద్దకు కోవూరు శాంతినగర్‌లో ఓ చిన్నారి వచ్చి వర్షాకాలంలో తాము పాఠశాలకు వెళ్లాలంటే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, రోడ్డు వేయించాలని కోరింది. వెంటనే పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ సహాయకులను పిలిచి సీసీరోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షల నిధులు కేటాయించి నిర్మాణ పనులు చేపట్టాలని ఎమ్మెల్యే ప్రసన్న ఆదేశించారు. దీంతో ఆ చిన్నారి సంతోషానికి అవధులు లేవు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటి వరకు 66 సచివాలయాల పరిధిలో 77,196 గడపలు తిరిగినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ శ్రీలత, సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, ఎంఏఏబీ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీహరి, మండల ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ ప్రసాద్, సర్పంచ్‌లు విజయ, లక్ష్మీకుమారి ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

- డీఈ జగదీశ్వరి


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీఈ జగదీశ్వరి

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ పరిధిలోని జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని గృహ నిర్మాణశాఖ డీఈ జగదీశ్వరి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని పెద్దూరు లేఅవుట్‌లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బుచ్చిరెడ్డిపాళెం అర్బన్ కంటే రూరల్ పరిధిలో ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. అర్బన్‌లో కూడా ఇళ్ల నిర్మాణ విషయంలో పురోగతి సాధించాలని సూచించారు. నిర్ణీత గడువులోపు ఇళ్లను నిర్మించి ప్రారంభించే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే లబ్ధిదారులు, కాంట్రాక్టర్లతో కూడా మాట్లాడి త్వరగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఆమె వెంట నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, హౌసింగ్ సిబ్బంది ఉన్నారు.

'జగనన్నకు చెబుదాం'ను సద్వినియోగం చేసుకోండి


బుచ్చిరెడ్డిపాళెం: అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ సుధీర్


పొదలకూరు : అర్జీదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసాద్

బుచ్చిరెడ్డిపాళెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సుధీర్ కోరారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు వీలుంటుందని తెలిపారు. వివిధ సమస్యలపై మూడు అర్జీలు వచ్చాయని, త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్యామ్, ఎఫ్‌డీఓ పొట్టయ్య పాల్గొన్నారు.

- **పొదలకూరు :** స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఐఎస్ ప్రసాద్ నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు వినతిపత్రాలను అందజేశారు. రెవెన్యూ శాఖకు సంబంధించి పట్టాదారు పుస్తకాలు, అసైన్మెంట్ భూములు, భూముల కొలతలు తదితర అంశాలపై వినతులను అందజేశారు. ఎంపీడీఓ కార్యాలయానికి సంబంధించి రెండు అర్జీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ నరసింహారెడ్డి, హౌసింగ్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు శివమోహన్, కసనానాయక్, ప్రసాద్, ఏపీఎం రోజ్‌మేరీ తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు తహసీల్దార్‌గా రామయ్య

పొదలకూరు : తిరుపతి జిల్లా పెళ్లకూరు డిప్యూటీ తహసీల్దార్ ఎస్.రామయ్యకు మండల అడహక్ తహసీల్దార్‌గా హోదా కల్పిస్తూ పొదలకూరుకు బదిలీ చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఐఎస్ ప్రసాద్‌ను పెళ్లకూరు తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన సుమారు ఏడాది కాలం ఇక్కడ పనిచేశారు. పాలనాపరమైన వెసులుబాటు కోసమే ఈయన్ను బదిలీ చేసినట్లుగా తెలుస్తోంది.

బీమా నగదు అందజేత

మనుబోలు : ఇటీవల కుటుంబ పెద్దలను కోల్పోయిన రెండు కుటుంబాలకు వైఎస్సార్ బీమా నగదును వైఎస్సార్‌సీపీ నేతలు సోమవారం అందజేశారు. మనుబోలు చంద్రమౌళినగర్‌కు చెందిన మల్లికార్జున అనే వ్యక్తి వడదెబ్బతో మరణించాడు. అలాగే అదే ప్రాంతానికి చెందిన కొట్లపాటి శంకరయ్య మరణించాడు. వారి కుటుంబ సభ్యులకు తక్షణ సాయం కింద బీమా నగదు రూ.10 వేల చొప్పున అందించారు. చిట్టమూరు అజయ్‌రెడ్డి, కటికవేటి చంద్రశేఖర్‌రెడ్డి, అనమాల ప్రభాకర్‌రెడ్డి, దువ్వూరు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవితకు బంగారు బాట


ఆకుపై వేసిన బాలిక చిత్రం

ముత్తుకూరు : జగనన్న విద్యాకానుక ద్వారా పేద విద్యార్థుల భవిష్యత్తుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బంగారు బాట వేశారని సుబ్బారెడ్డిపాళెం యూపీస్కూల్ తెలుగు పండిట్ సోమా పద్మారత్నం అన్నారు. ఇందులో భాగంగా ఎండిన నూరు వరహాల ఆకుపై విద్యాకానుక కిట్ పొందిన బాలిక చిత్రాన్ని రూపొందించారు. పేద విద్యార్థులకు విద్యాకానుక గొప్ప వరం వంటిదని ఈ చిత్రం ద్వారా ప్రశంసించారు.

లవకుమార్ మృతికి సంతాపం

నెల్లూరు (టౌన్): జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న లవకుమార్ సోమవారం మృతి చెందారు. ఆయన మృతికి ఉప రవాణా కమిషనర్ బీ చందర్‌తో పాటు కార్యాలయ సిబ్బంది రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. లవకుమార్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఇన్‌చార్జి ఆర్టీఓ మురళీమోహన్, ఎంవీఐలు బాలమురళీకృష్ణ, కార్తీక్, ఏఎంవీఐలు పూర్ణచంద్రరావు, స్వప్నిల్‌రెడ్డి, రఘువర్ధన్ రెడ్డి, ఏఓలు కిషోర్, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

భక్తుల మనోభావాలకు పెద్దపీట


పూజల్లో పాల్గొన్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- వైభవంగా విగ్రహ ప్రతిష్ట వేడుకలు

ముత్తుకూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం భక్తుల మనోభావాలకు పెద్దపీట వేసి, గౌరవిస్తోందని రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ముత్తుకూరు మండలం, కృష్ణపట్నం గ్రామంలో రూ.13.50 కోట్లతో ప్రతిష్టాత్మకంగా పునర్నిర్మించిన రుక్మిణీ–సత్యభామ, వేణుగోపాలస్వామి(విష్ణాలయం) ఆలయంలో సోమవారం జరిగిన విగ్రహాల ప్రతిష్ట, మహా కుంభాభిషేకం వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. ఏడంతస్తుల గోపురంపై కలశాలకు అభిషేకం చేశారు. హోమగుండానికి ప్రణమిల్లారు. మహాకుంభాభిషేకం వేడుకలను ప్రారంభిస్తూ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు ఆచరించారు. అంతకుముందు మేళతాళాలు, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఆలయ ఈఓ జనార్ధనరెడ్డి, కమిటీ చైర్మన్ సుబ్బయ్య పిళ్లై మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం కాకాణి మాట్లాడుతూ, మనుమసిద్ధి కాలంనాటి ఈ ఆలయాన్ని రాతితో పునర్నిర్మించడం చాలా అరుదైన విషయమన్నారు. ఈ వేడుకల్లో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. దీనిని అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా పునర్నిర్మించేందుకు పూనుకున్న ఆలయ కమిటీ చైర్మన్, ఈఓ, పాలక మండలి సభ్యులు, గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధనరెడ్డి, అదానీ కృష్ణపట్నంపోర్టు సీఈఓ సంజయ్, అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, పీఆర్వో వేణుగోపాల్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నెల్లూరు శివప్రసాద్, మండల ఉపాధ్యక్షుడు పోలిరెడ్డి చిన్నపరెడ్డి, ఉపసర్పంచ్ రాగాల వెంకటేశ్వర్లు, నాయకులు దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం భక్తుల కోసం ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

అందరికీ అందుబాటులో రైతు బజార్


రైతుబజార్లో వ్యాపారాలు చేసుకునేందుకు నిర్మించిన ప్లాట్‌ఫామ్స్

- పూర్తయిన నిర్మాణ పనులు
- త్వరలో ప్రారంభం


నిర్మాణ పనులు పూర్తయిన రైతుబజార్

పొదలకూరు : పట్టణ నడిబొడ్డున తలపెట్టిన రైతు బజార్ అందరికీ అందుబాటులోకి రానుంది. ముఖ్యంగా మహిళలకు ఎంతో ఉపయోగపడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రైతుబజార్‌కు నిధులు సమకూర్చి నిర్మాణ పనులు పూర్తి చేయించారు. త్వరలో ప్రారంభానికి సిద్ధంగా బజారు ముస్తాబవుతోంది. తొలుత రూ.10 లక్షలతో పనులు జరిగి అనివార్య కారణాల వల్ల జాప్యం నెలకొంది. అనంతరం కాకాణి మంత్రి పదవి చేపట్టిన తర్వాత మరో రూ.18 లక్షలను మంజూరు చేయించారు. దీంతో రైతు బజార్ నిర్మాణ పనులు వేగం అందుకున్నాయి. ఇక్కడ 20 మంది వ్యాపారాలు చేసుకునేందుకు అనువుగా ప్లాట్‌ఫామ్స్‌ను నిర్మించారు. అంతేకాక మురుగుదొడ్ల సౌకర్యం కూడా కల్పించారు. ఫలితంగా కూరగాయలు, పండ్లు, ఇతర రైతులు పండించిన వాటిని ఇక్కడ విక్రయించుకునేందుకు అవకాశం కలిగింది. మార్కెటింగ్‌శాఖ పర్యవేక్షణలో ఇక్కడ వ్యాపారాలు చేసుకోవాల్సి ఉంటుంది.